క్లుప్తంగా

ఘనంగా సద్గురు రవిదాస్ మహరాజ్ జయంతి

ఆదిలాబాద్‌రూరల్: శ్రీసంత్ సద్గురు రవిదాస్ మహరాజ్ 647వ జయంతి వేడుకలు శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా మోచి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలశంకర్ మాట్లాడుతూ.. దేశ తత్విక ఉద్యమాల్లో ధర్మిక, రచనల ద్వారా భక్తి ఉద్యమాలతో అసమానతలు రూపుమాపి, కుల రహిత సమాజం కోసం అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. కార్యక్రమంలో మోచి సంఘం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యాదర్శులు సాగర్, ఓటర్కార్ రాము, ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి బాలశంకర్ శ్రీకాంత్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈవోను కలిసిన పీఆర్టీయూ నాయకులు

నేరడిగొండ: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేలా చూడాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లాశాఖ నాయకులు జెడ్పీ సీఈవో రత్నమాలను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆడే నూర్‌సింగ్ నాయక్, నర్ర నవీన్ యాదవ్, జాదవ్ ప్రకాష్, సుధాకర్, ఉపాధ్యాయులు దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

నేరడిగొండ: మండలంలోని రోల్‌మామడ సమీపంలో గల గురుసాహెబ్ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. హోమం అనంతరం ధ్వజరోహన కార్యక్రమాన్ని మత గురువులైన మధ్యప్రదేశ్‌కు చెందిన చందర్‌సింగ్ మహరాజ్, ఏమైకుంటకు చెందిన సూరజ్ మహరాజ్ చేతుల మీదుగా చేపట్టారు. లబాన కులస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సన్మానం



సన్మానిస్తున్న వడూర్ గ్రామస్తులు

నేరడిగొండ: బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, వైస్ చైర్మన్ ఆడే వసంత్‌రావులను శనివారం వడూర్ గ్రామస్తులు సన్మానించారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ గంగారెడ్డిని శాలువా, పూలమాలలతో సత్కరించి స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొప్పుల ఊశన్న, పాల శంకర్, బోలిశెట్టి రాములు, మాకునూరి రాములు, కుంట శంకర్, ధర్మదాస్ మహేందర్, బుక రాములు, ఎర్రల్ల చంద్రశేఖర్, ఈర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన బొడ్డు గంగారెడ్డిని మాజీ ఎంపీపీ ముత్యంరెడ్డి శాలువాతో సత్కరించారు. శనివారం పిప్పల్‌ధరి గ్రామానికి వెళ్లిన ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మల్లేష్, సత్యనారాయణ, రవి, భోజన్న, గంగారెడ్డి, చిన్నబాపు, లోలపు పోశెట్టి, నాయకులు పాల్గొన్నారు.

మాక్ జెడ్పీ సమావేశం

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాక్ జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థులు జెడ్పీటీసీలుగా, జెడ్పీ చైర్మన్‌గా వ్యవహరించారు. మేడారం జాతరను పురస్కరించుకొని సురక్షిత, పర్యావరణహిత, కాలుష్యం లేని జాతర నిర్వహణ గురించి చర్చించారు. ప్లాస్టిక్ నిషేధం, మాంసం వ్యర్థాల తరలింపు, చెత్త సేకరణ తరలింపు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తదితర అంశాల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో నో బ్యాగ్ డే

తలమడుగు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఏఎస్సై సురేందర్ ఫిర్యాదులు ఎలా స్వీకరిస్తారు, ఎఫ్ఐఆర్ ఎలా నమోదు చేస్తారు తదితర అంశాలను వివరించారు. విద్యార్థునులను ఎవరైనా వేధిస్తే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకట్‌రావు. ఉపాధ్యాయులు లలిత, వెంకటేశ్వర్, వినోద్ రెడ్డి, మురళీధర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం'

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి ఆనంద్‌రావ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని టెకిడిగూడ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నిర్మించనున్న సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలనలో సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు అంతంత మాత్రంగానే జరిగాయన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే జిల్లాలు, రాష్ట్రాలు, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో 'రియల్' దందా

- అక్రమ లేఅవుట్‌లతో ప్లాట్ల విక్రయాలు
- ప్రేక్షకపాత్రలో బల్దియా యంత్రాంగం



గాంధీనగర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రియల్ వ్యాపారం జోరుగా సాగుతుండడంతో పలువురు వ్యాపారులు వ్యవసాయ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. తాజాగా పట్టణంలోని గాంధీనగర్‌లో అక్రమ లే అవుట్లను ఏర్పాటు చేశారు. అధికారికంగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా బండలు పాతేసి విక్రయించేస్తున్నారు. వీటిపై చర్యలు చేపట్టాల్సిన బల్దియా యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

అనుమతులు లేకుండానే..

పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలను ఆనుకుని ఉన్నటువంటి భూముల్లో పలువురు రియల్ వ్యాపారులు అక్రమంగా లే అవుట్లను ఏర్పాటు చేశారు. వీటికి మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక విభాగం నుంచి కానీ, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రి ప్లానింగ్ (డీటీసీపీవో) నుంచి ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా వ్యవసాయ భూమిలో బండలు పాతి ప్లాట్లుగా విభజించారు. వాటిల్లో ఎలాంటి వసతులు కల్పించకుండానే విక్రయిస్తున్నారు. ఒక్కో ప్లాట్‌ను రూ.10 నుంచి రూ.15 లక్షలకు విక్రయిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు.

వసతులు కల్పించకుండానే విక్రయాలు

సాధారణంగా లే అవుట్‌ను ఏర్పాటు చేయాలంటే మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక విభాగం నుంచి లేదా డీటీసీపీ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. వారి నుంచి అనుమతులు లభించాకే లే అవుట్ విస్తీర్ణంలో 15 శాతం భూమిని మున్సిపాల్టీకి మార్టిగేజ్ చేయాలి. ఇలా చేశాకే లే అవుట్ పనులను ప్రారంభించి అందులో 40 పీట్ల విస్తీర్ణంతో కూడిన రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులను కల్పించాలి. పార్కింగ్, ఆలయాల కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి. కానీ ఈ లే అవుట్లలో ఇలాంటి నిబంధనలు పాటించడం లేదు. కేవలం బండలను పాతి ప్లాట్లను ప్రజలకు విక్రయిస్తున్నారు. వాటిని కొనుగోలు చేసిన వారు భవిష్యత్‌లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలంటే అధికారిక అనుమతులు లభించక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి అనుమతుల్లేవు

ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో వెలిసిన అక్రమ లే అవుట్లకు ఎలాంటి అధికారిక అనుమతులు లేవు. వాటిపై విచారించి తగు చర్యలు తీసుకుంటాం. ప్రజలు అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేయవద్దు. ఎందుకంటే భవిష్యత్‌లో ఇళ్ల నిర్మాణాల కోసం అనుమతులు లభించక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– అనురాధ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్: బోథ్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని ఇచ్చోడ, సొనాల ఆర్‌అండ్‌బీ అంతరాష్ట రహదారిలో కొలారి గ్రామం వద్ద రూ.2 కోట్లతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలో 15 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రూ.8 లక్షల సర్వశిక్ష అభియాన్ నిధులతో నిర్మించే మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, తహసీల్దార్ శంకర్, ప్రిన్సిపాల్ సునీల్, లక్కం తిరుమల, పండగ మురళీమోహన్, సోన్‌టాకే గజానంద్, పరచ సాయన్న, ఫడ్ జ్ఞానేశ్వర్ విద్యాసాగరా, లక్ష్మణ్, విలాస్, మాధవ్, డుబ్బుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భీమన్న దేవుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో గల భీమన్న గుట్టపై వెలిసిన భీమన్న దేవుడిని శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన వెంట ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్, బీఆర్ఎస్ నాయకులు సాబ్లే నానక్‌సింగ్, ప్రతాప్ సింగ్, కొయ్యాడి గంగయ్య, సరీష్ చంద్, రాథోడ్ సురేందర్, లింబాజీ ఉన్నారు.

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం కుటుంబసమేతంగా మండలంలోని తన స్వగ్రామమైన రాజుర గ్రామంలో సేవాలాల్, జగదాంబ దేవిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జగదాంబ దేవికి ప్రత్యేక పూజలు చేశారు.



భూమిపూజ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

గుడిహత్నూర్: మండల కేంద్రంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం భూమిపూజ చేశారు. రూ.2 లక్షలతో మహాంకాళి ఆలయానికి ప్రహారీ, రవీంద్రనగర్‌లో రూ. 5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న సేవలను వైద్యాధికారి శ్యాంసుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్ జాదవ్ సునీతా రమేశ్, తిరుమల్ గౌడ్, ఆడే శీలా, షగీర్‌ఖాన్, సంజీవ్ ముండే, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములగుట్ట జాతర

- భారీగా తరలివచ్చిన భక్తజనం

తాంసి: మండలంలోని పాలొది గ్రామశివారులోని రాములగుట్టపై కొనసాగుతున్న జాతర శనివారం భక్తజన సంద్రంగా మారింది. గుట్టపై వెలసిన శ్రీసీతారామచంద్రుల జాతర శనివారం వైభవంగా ముగిసింది. నాలుగు రోజులుగా ఆలయ ప్రాంగణంలో వేద పండితుల సమక్షంలో హోమం, అర్చన, భజన, కీర్తన, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు శనివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కల్యాణ మండపంలో శ్రీ సీతారాముల కల్యాణాన్ని పండితులు సతీష్, వీరయ్య మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరై సీతారామయ్యను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, గ్రామపెద్దలు గంగారం, సతీష్, రాంరెడ్డి, లింగారెడ్డి, ఆశన్న, నాగారెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు కార్యక్రమాలు శనివారం ప్రారంభయ్యాయి. రూ.1.50 కోట్లతో నిర్మించిన ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు గ్రామస్తులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి చేతుల మీదుగా సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయం

కల్యాణం.. కమనీయం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో గణపతి, నవగ్రహ పూజలు చేశారు. స్వామి విగ్రహాన్ని ఆలయం నుంచి మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. కల్యాణంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చామన్‌పల్లి సుదర్శన్, విశ్వబ్రాహ్మన సంఘం నాయకులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

శివపార్వతుల కల్యాణం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని అతిపురాతన శివాలయంలో శనివారం శివపార్వతుల కల్యాణాన్ని ఘనగా నిర్వహించారు. తెల్లవారుజామున మహా రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఇచ్చోడకు చెందిన గురుదాస్ మిట్టపల్లి శంకరయ్య రచించిన తెలుగు హరిపాఠము మూడో ప్రతిని ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, సర్పంచ్ జాదవ్ సునీతా రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, తిరుమల్ గౌడ్, భీంరావ్ నాయక్, మాధవ్ కేంద్రే పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్ రూరల్: సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని పాత ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు, చందూరి గ్రామంలో నిర్వహించిన హీరాసుక జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. హీరాసుక చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజనలు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ.. భావితరాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉర్సులో పాల్గొన్న ఎమ్మెల్యే..

ఉట్నూర్ మండల కేంద్రంలోని హజరత్ సాదక్, పంజాబి రహిమతుల్లాలే దర్గా ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి దర్గా వద్ద చాదర్ కప్పి ప్రార్థనలు చేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న బాలూరి గోవర్ధన్ రెడ్డి

జైనథ్: కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో రూ. 5కోట్ల ఈజీఎస్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీసీసీబీ చైర్మెన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కామాయి గ్రామంలో రూ. 6లక్షల ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, గిమ్మ సంతోష్, అల్లూరి భూమారెడ్డి, యాల్ల పోతరెడ్డి, బాయిన్‌వార్ గంగారెడ్డి, మునిగెల విఠల్, ఉమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు..

బేల: మండలంలోని సిర్సన్న గ్రామంలో శనివారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.27 లక్షల వ్యయంతో సీసీరోడ్డు పనులకు కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు గుండవార్ సంజయ్ భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మల్లారెడ్డి, వాంఖడే వామన్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణ కోసమే సనాతన ధర్మం

ఇంద్రవెల్లి: ధర్మ పరిరక్షణ కోసం సనాతన ధర్మాన్ని అనుసరించే కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఆధ్యాత్మిక గురువు నారాయణ మహరాజ్ అన్నారు. శనివారం సనాతన ధర్మ సేవా కేంద్రం సాయినగర్ హనుమాన్ ఆలయం నుంచి అందునాయక్‌తండా గ్రామంలోని శ్రీజ్వాలముఖి దుర్గామాత ఆలయం వరకు ఏకరూప దుస్తులతో ర్యాలీ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. లోక కల్యాణం, హిందూ సమాజ జాగృతి కోసమే సనాతన సంప్రదాయాన్ని, విలువలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ధర్మ పరిరక్షణలో యువత ప్రాధాన్యం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో రాంసింగ్‌బాబా, గిత్తే మారుతి, సోపాన్ మహరాజ్, విష్ణు మహరాజ్, బాలాజీ, వామన్, మారుతి డోంగ్రె పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సమాజ్ భక్తులు

బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాలకు పెద్దపీట

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల నిర్మాణం జరిగిందని ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం అదిలాబాద్ రూరల్ మండలంలోని వాన్‌వాట్ గ్రామంలో నిర్వహించిన హీరాసుక జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. గోండి ధర్మ గురు హీరాసుక చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కచికంటి గ్రామంలో వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహ ఆవిష్కరణ పాల్గొని, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ నేటి తరాలకు కూడా స్ఫూర్తినిచ్చేలా గత ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేశ్, బీఆర్ఎస్ నాయకులు కుమ్ర రాజు, సేవ్వా జగదీష్, బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

కుమురం భీం ఆశయ సాధనకు కృషి

బేల: ఆదివాసీ పోరాట యోధుడు కుమురం భీం ఆశయ సాధన కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని మశాల(బి) గ్రామంలో కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుమురం భీం జల్ జంగల్ జమీన్ కోసం నైజాం సర్కార్‌తో పోరాటం చేసిన మహావీరుడని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ నాయకులు తాక్రే గంభీర్, సతీష్ పవార్, బండి సుదర్శన్, ప్రమోద్‌రెడ్డి, తన్వీర్‌ఖాన్, ఆదివాసీలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న జోగు రామన్న

ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలి

బజార్‌హత్నూర్: జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి పనులను పకడ్బందీగా చేపట్టాలని డీఆర్‌డీవో అడిషనల్ పీడీ కుటుంబరావ్ అన్నారు. శనివారం మండలంలోని బజార్‌హత్నూర్, గిర్నూర్, పిప్రి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీవో, ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమచికిత్స కిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సూర్యప్రకాష్, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలని అడిషనల్ డీఆర్‌డీఏ పీడీ కుటుంబరావు అన్నారు. శనివారం మండలంలోని సాథ్‌నంబర్, అడేగామ(కె) గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జాబ్ కార్డులు ఉన్న ప్రతిఒక్కరికీ వంద రోజులు పని కల్పించాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ సూర్యప్రకాశ్, ఏపీవో నరేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్న కుటుంబరావు

ఆత్రం భాస్కర్‌కు మద్దతు ఇవ్వండి

ఇచ్చోడ: ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆత్రం భాస్కర్‌కు మద్దతు ఇవ్వాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను ఆత్రం భాస్కర్ సైన్యం సభ్యులు కోరారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆత్రం భాస్కర్ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆత్రం మహేందర్, సిడం వెంకటేశ్ మడావి శంభు, ఆత్రం లక్ష్మణ్, ఆత్రం భీమరావ్, కోట్నాక్ కోటేష్, దూర్వ రాజు పాల్గొన్నారు.

హీరాసుక జయంతి విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈనెల 26న నిర్వహించే హీరాసుక జయంతికి విజయవంతం చేయాలని ఆదివాసీ ప్రధాన్ పురోహిత్ సంఘం పెద్దలు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉదయం 11 గంటలకు హీరాసుక జయంతిని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా ఆదివాసీ పెద్దలు, యువకులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. గ్రామపటేల్ గేడం జ్ఞానేశ్వర్, మడావి విశ్వనాథ్, సోయం రాందాస్, కనక రజినికాంత్, మురహరి, భారత్, సోనేరా పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లు పునః ప్రారంభం

జైనథ్: మండలంలో రైతుల వద్ద సోయా నిల్వలు ఉన్నందున మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోళ్లను పునః ప్రారంభిస్తున్నట్లు జైనథ్ పీఏసీఎస్ చైర్మన బాలూరి గోవర్దన్ రెడ్డి అన్నారు. శనివారం అధికారులు, నాయకులతో కలిసి మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పంట తీసుకొచ్చిన రైతును సన్మానించి, స్వీట్లు తినిపించారు. క్వింటాల్‌కు రూ. 4600 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. మార్చి 5వరకు కొనుగోళ్లు చేపట్టడం జరుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొడిచర్ల సుదర్శన్, తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, గడ్డం జగదీశ్ రెడ్డి, అల్లూరి అశోక్‌రెడ్డి, బద్దం సురేశ్‌రెడ్డి, మధుకర్, సొసైటీ కార్యదర్శి గంగన్న పాల్గొన్నారు.



రైతుకు స్వీట్ తినిపిస్తున్న బాలూరి గోవర్ధన్ రెడ్డి

మాదిగ జేఏసీ కమిటీలో జిల్లా వాసులకు చోటు

ఆదిలాబాద్‌రూరల్: మాదిగ జేఏసీ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన పలువురి చోటు దక్కింది. మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నక్క రాందాస్‌కు అవకాశం లభించగా.. ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మల్యాల మనోజ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్‌గా మోతే బారిక్ రావులను నియమిస్తున్నట్లు మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడుమర్తి రవి తెలిపారు. శనివారం నియమాక పత్రాలు అందుకున్నారు.

పల్లెల రూపురేఖలు మారుస్తాం

బోథ్: అభివృద్ధిలో పల్లెలను పరిగెత్తిస్తామని, పల్లెల రూపురేఖలు మారుస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌లు అన్నారు. శనివారం మండలంలోని మర్లపెల్లి గ్రామంలో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. చంటి, సంజీవ్, నిఖిల్, కమలాకర్, అబూద్, కపిల్ జాదవ్, గజానంద్, సుభాష్, మధుకర్ పాల్గొన్నారు.

ప్రకృతితో స్నేహం చేయండి

బోథ్: ప్రతిఒక్కరూ ప్రకృతితో స్నేహం చేయాలని, పక్షులను కాపాడాలని పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్ అన్నారు. శనివారం మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు తమ ఇంట్లో, పాఠశాలలో నీటి తొట్టిలను ఏర్పాటు చేయాలని సూచించారు.